న్యూస్‌రీల్

'బడి బయట పిల్లల గుర్తింపు సర్వే'



కోటపల్లి: బడి బయటి పిల్లల గుర్తింపు సర్వేను మల్లంపేటలో సోమవారం ఎంఈవో తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. 6 నుంచి 14సంవత్సరాల వయస్సు గల పిల్లలను తగిన తరగతిలో చేర్పించనున్నట్లు సీఆర్పీ సంపత్ తెలిపారు. 15 నుంచి 19సంవత్సరాల వయస్సు గల పిల్లలను ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 27, రూరల్ పరిధిలోని 18మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రభుత్వం అందించిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, ఎంపీపీ గుర్రం మంగ, జెడ్పీటీసీ వేల్పుల రవి, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్ట్

దండేపల్లి: వామపక్ష విద్యార్థి సంఘాలు సోమవారం ప్రగతిభవన్ ముట్టడికి పిలుపునివ్వడంతో, మండలంలోని పలువురు విద్యార్థి సంఘాల నాయకులను ఎస్సై సాంబమూర్తి సోమవారం తెల్లవారు జామున అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పిట్టల తిరుపతి, ఎస్‌ఎస్‌యూఐ నాయకుడు నలిమెల వినయ్, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకుడు శనిగారపు మురళీకృష్ణ ఉన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సారయ్య

చెన్నూర్: చెన్నూర్‌కు చెందిన నిట్టూరి సారయ్యను బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా, చింతలపల్లి గ్రామానికి చెందిన చెడెంకి మాంతయ్యను జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా అధ్యక్షుడు కాదాసి రవీందర్ తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ బలోపేతం కోసం సారయ్య, మాంతయ్యలు కృషి చేయాలని కోరారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

భీమారం: విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం మండల అధ్యక్షుడు గర్రెపల్లి సత్యనారాయణ సోమవారం డిమాండ్ చేశారు. జీవో 69ను రద్దు చేయాలన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న యువకులకు రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో నాయకులు పూసాల రుద్రశర్మ, మేరడగొండ మురళీ, రంగు నరేందర్, చెన్నోజు మనోహర్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాట	రూ.15
పచ్చిమిర్చి	50
చిక్కుడు కాయ	40
బీరకాయ	100
వంకాయ	50
కాకరకాయ	60
బెండకాయ	40
అలసంద	40
దొండకాయ	70
ములక్కాయ	140
సోరకాయ	20
క్యాబేజీ	60
క్యారెట్	50
క్యాప్సికం	90
పాలకూర	40
తోటకూర	40

- మంచిర్యాలఅగ్రికల్చర్



ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మిషన్ భగీరథ పథకం' కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల నీరుగారిపోతోంది. భీమారం మండలంలో ఆరు గ్రామాలకు, చెన్నూర్‌లోని ఎమ్మెల్యే కాలనీలో నెల రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.
ఈ దుస్థితిపై కథనం..



చెన్నూర్: ఎమ్మెల్యే కాలనీలో తెగిన మిషన్ భగీరథ పైప్‌లైన్

భగీరథ.. తప్పని వ్యథ

- నెల రోజులుగా నీటి సరాఫరా బంద్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పైప్‌లైన్ వేసేందుకు తవ్వి వదిలేసిన కాలువ

భీమారం: భీమారం మండల కేంద్రంలోని జాతీయరహదారి పక్కన ఇంటింటికీ నీటిని అందించేందుకు వేసిన పైపులైన్ పగిలిపోగా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు. నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయకపోవడంతో, ఆరు గ్రామపంచాయతీలకు నీటి సరఫరా నిలిచిపోయింది. మంచిర్యాలలోని గ్రిడ్ నుంచి చెన్నూరు వెళ్లే ప్రధాన పైపులైను ద్వారా భీమారం మండలంలోని 11గ్రామ పంచాయతీలకు నీటిని అందిస్తున్నారు. అయితే గ్రిడ్ నుంచి వచ్చే నీటిని ఆరెపల్లి, భీమారం, మద్దికల్, పోలంపల్లి, కొత్తపల్లి, ఎలకేశ్వరం గ్రామాలకు తరలించే పైపులు పగిలిపోవడంతో ఆయా గ్రామాలకు నీటి సరఫరాను అధికారులు నిలిపివేశారు. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి వెంటనే నీటిని అందించాల్సి ఉండగా, ఇప్పటివరకు పనులు పూర్తి చేయలేదు. దీంతో నీటి కోసం ప్రజలకు బోరుబావులే దిక్కవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని నీటి సరఫరాను పునఃరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

చెన్నూర్‌లోని ఎమ్మెల్యే కాలనీలో..

చెన్నూర్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే కాలనీలో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయి, నెల రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో కాలనీ ప్రజలు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. గత నెల రోజుల క్రితం భగీరథ పైపులైన్ కట్ అయ్యింది. పైపులైన్ కట్ అయి నీటి సరఫరా నిలిచిపోయిందని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ కాంట్రాక్టర్‌ను కాలనీ వాసులు సంప్రదించగా పైపులైన్ కట్ అయితే మా బాధ్యత ఉండదని తేల్చి చెప్పారు. మున్సిపాలిటీ అధికారులని అడిగితే స్పందన లేదని కాలనీ వాసులంటున్నారు.

150కుటుంబాలు..

ఎమ్మెల్యే కాలనీలో 150కుటుంబాలు 500మంది జనాభా జీవనం సాగిస్తున్నారు. కాలనీలో ఒక చేతి పంపు, పబ్లిక్ నల్లాలు ఉన్నాయి. పబ్లిక్ నల్లాలు దిగువ ప్రాంతం వాసులకు మాత్రమే నీరు సరఫరా అవుతుంది. ఎగువ ప్రాంతంలో ఉన్నవారికి నీటి సరఫరా కావడం లేదు. దీంతో కాలనీ వాసులంతా చేతి పంపునే ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. రెక్కాడితే డొక్కాడని కాలనీ వాసులు తాగునీటి కోసమే సమయం వృథా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే పైప్‌లైన్‌కు మరమ్మతు చేపట్టి భగీరథ నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బంది అవుతోంది



నెల రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. బోరుబావుల వద్ద తెచ్చుకోవాల్సి వస్తుంది. చాలా ఇబ్బంది అవుతోంది. వెంటనే పైప్‌లైన్ మరమ్మతు చేసి నీటిని పునఃరుద్ధరించాలి.

- తిరుపతి, గ్రామస్తుడు, పోలంపల్లి

త్వరలో నీటిని సరఫరా చేస్తాం

భీమారం వద్ద దెబ్బతిన్న పైపులైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ వేసి ఐదు రోజుల్లో ఆరుగ్రామాల ప్రజలకు నీటిని అందిస్తాం. పైపులు రావడం ఆలస్యంతో పనులు చేపట్టలేదు.

- వివేక్, మిషన్‌భగీరథ గ్రిడ్ ఏఈఈ మంచిర్యాల

పైప్‌లైన్‌కు మరమ్మతు చేపడుతాం

ఎమ్మెల్యే కాలనీలో మిషన్ భగీరథ పైపులైన్ తెగిపోయింది. ఈ విషయం నా దృష్టికి వచ్చింది. పైప్‌లైన్ మరమ్మతు చేపట్టి తాగు నీటి సరఫరా చేస్తాం.

- అర్చనరాంలాల్‌గిల్డా, మున్సిపల్ చైర్‌పర్సన్, చెన్నూర్

అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో ఎమ్మెల్యే

బెల్లంపల్లి: స్థానిక ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. పేదరికంలో పుట్టి, కుల వివక్షతకు గురై పట్టుదలతో చదివి బాబాసాహెబ్ ప్రపంచమేధావిగా ప్రసిద్ధిగాంచారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నిరంజన్, సొసైటీ రాష్ట్ర కార్యదర్శి పేరం రాజశేఖర్, సభ్యులు రాజనర్సు, శశిధర్, నవీన్ పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం పునఃప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేటలో గ్రామ పంచాయతీ భవనానికి ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఆదేశాల మేరకు జీపీ నిధులతో పాతగా ఉన్న పంచాయతీ భవనానికి మరమ్మతు చేయించి నూతన హంగులతో భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆ భవనాన్ని సోమవారం ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి పునఃప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెన్నపురెడ్డి బాపురెడ్డి, సర్పంచ్ బుర్ర రాకేష్‌గౌడ్, ఉపసర్పంచ్ కుంభం ముకుందరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, టీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లెల దామోదర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు సద్వినియోగం చేసుకోవాలి



మొక్కలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

కోటపల్లి: కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన పండ్ల మొక్కలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శాస్త్రవేత్తలు టి.వి ప్రసాద్ సూచించారు. మల్లంపేట, నక్కలపల్లి, కోటపల్లి, పిన్నారం గ్రామాల్లోని ఎస్సీ రైతులకు ఐదు రకాల పండ్ల మొక్కలు, పది రకాల కూరగాయల విత్తనాలు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు టి.వి ప్రసాద్ మాట్లాడుతూ.. రైతులకు అందజేసిన కూరగాయల, పండ్ల మొక్కలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు ఐకార్ నుంచి విడుతల వారీగా అన్ని రకాల పరికరాలు అందిస్తున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో కేఏస్ రెడ్డి, ఏజికె రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

దండేపల్లి: పదోతరగతి విద్యార్థులకు మంచిర్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో దండేపల్లి మండలం వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆకుల హర్షిత ప్రథమ స్థానంలో నిలువగా, సామల, మౌనిక ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరిని పాఠశాల హెచ్‌ఎం గాయిత్రీ, సిబ్బంది విద్యార్థులను సోమవారం అభినందించారు.

వినతిపత్రం అందజేత

జైపూర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోహన్‌రెడ్డికి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థుల పెండింగ్‌లో ఉన్న ఫీజు రియెంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు సికిందర్, సంజీవ్ పాల్గొన్నారు.

ఘనంగా భీమదేవర జెండా పండుగ



జెండా ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

కోటపల్లి: మండలంలోని ఆదివాసీ కొలావార్(మన్నెవార్)ల అత్మగౌరవ 21వ భీమదేవర జెండా పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. శెట్‌పల్లి, శంకరాపూర్ గ్రామాల్లో సర్పంచ్ ఉమా, శశిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భీమదేవరకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆదివాసీల జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గ్రామ అధ్యక్షుడు చంద్రయ్య, ఉపసర్పంచ్ మోహన్‌రెడ్డి, నాయకులు వేముల రాజం, పుప్పాల సతీశ్ పాల్గొన్నారు.

పనుల పరిశీలన

వేమనపల్లి: మండలంలోని రాజారాం గ్రామంలో సోమవారం ఎంపీవో బాపురావు తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం జీపీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభ ఏర్పాటు చేసి అధికారులకు సూచనలు చేశారు.

ప్రజావాణికి దరఖాస్తులు నిల్

- ఒక్క దరఖాస్తు కూడా రాని వైనం
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన



కన్నెపల్లిలో ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు



భీమారంలో పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాస్



చెన్నూర్‌రూరల్: పాల్గొన్న అధికారులు

భీమారం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఉదయం వచ్చిన అధికారులు మధ్యాహ్నం వరకు ఉన్నా దరఖాస్తులు రాలేదు. ఈ మేరకు ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు, ప్రజలు తమ సమస్యలు నేరుగా అధికారులకు విన్నవించుకోవచ్చని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇందులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భీమిని: కన్నెపల్లి, భీమిని మండలాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. ప్రజలు ఏ ఒక్కరు కూడా రాలేదు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాధాకిషన్ మాట్లాడుతూ ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంచందర్, ఏపీవో శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: చెన్నూర్‌లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువయ్యింది. ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో టి.శ్రీనివాస్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



లక్సెట్టిపేట: విధులు బహిష్కరిస్తున్న న్యాయవాదులు



బెల్లంపల్లి: నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

బెల్లంపల్లి: నిజామాబాద్ జిల్లాలో న్యాయవాదులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బెల్లంపల్లిలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అంకెం శివకుమార్, చేను రవికుమార్ మాట్లాడుతూ.. కోర్టు ఆర్డర్ అమలు కోసం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి కోర్టు సిబ్బంది, ఓ న్యాయవాది వెళ్లారని దీంతో కలెక్టర్ ఆదేశాలతో పోలీసులు అక్రమ కేసు పెట్టారని తెలిపారు. బేషరతుగా ఆ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు జోక్యం చేసుకుని న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు సంగీత, సునీల్, గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: నిజామాబాద్ కోర్టు సిబ్బంది, న్యాయవాదిపై క్రిమినల్ కేసులు పెట్టడానికి నిరసిస్తూ మండల కేంద్రంలోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. విధులకు ఆటంకం కలిగించి, దాడి చేసి కేసులు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్, న్యాయవాదులు సత్యనారాయణ, ఎజీపీ పద్మ, రాజేశ్వర్‌రావు, అక్కల శ్రీధర్, సురేందర్, సత్తన్న, రవి, అఫ్జల్‌బియ్యాబాని, తిరుపతిస్వామి, సుమన్‌చక్రవర్తి, తాజొద్దీన్, శివశంకర్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



బెల్లంపల్లి: విద్యార్థులను అభినందిస్తున్న సీఐ, ఎస్సై



దండేపల్లి: విద్యార్థినులను అభినందిస్తున్న ఎస్సై

బెల్లంపల్లి: పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్‌లో ఈ నెల 8వ తేదీన జరిగిన నేషనల్ లెవల్ ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో బెల్లంపల్లి కరాటే విద్యార్థులు పాల్గొని సత్తాచాటారు. ఆల్ కలర్ బెల్ట్ స్పారింగ్ పోటీల్లో శశిధర్ ప్రథమ బహుమతి, సీనియర్ బ్రౌన్ బెల్ట్ స్పారింగ్‌లో సంజీవ్ ప్రథమ బహుమతి సాధించి గ్రాండ్ చాంపియన్ షిప్‌ను దక్కించుకున్నారు. కరాటే పోటీల్లో మెరుగ్గా రాణించి గ్రాండ్ చాంపియన్ షిప్ సాధించిన ఇరువురు విద్యార్థులను సోమవారం బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.రాజు, ఎస్సై సంతోష్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని విజయబావుటా ఎగురవేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు తర్ఫీదును ఇచ్చిన కరాటే మాస్టర్లు పైడిపల్లి నరేష్, విజ్జగిరి రవిని ప్రశంసించారు.

దండేపల్లి: కాల్వశ్రీరాంపూర్‌లో జరిగిన ఆల్ స్టైల్ కరాటే పోటీల్లో దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు కరాటే మాస్టర్ బచ్చల అంజన్న తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారిలో కటాస్ విభాగంలో సౌమ్య చాంపియన్‌షిప్ సాధించగా, అండర్ 14 కటాస్ విభాగంలో అఖిల, సౌమ్య, శ్రీలత జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ఎస్సై సాంబమూర్తి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఎస్సార్పీ 3 గనిపై జరిగిన కార్యక్రమంలో గని మేనేజర్ సంతోశ్‌కుమార్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఎస్టీ ఉద్యోగుల సంఘం రీజియన్ ఉపాధ్యక్షుడు గోప్యా సోమవారం ఆవిష్కరించారు.

నివాళులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గనిపై సోమవారం భారతదేశపు మొట్టమొదటి మహిళా ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమషేక్ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి సునిల్‌కుమార్, టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి ఒడ్నాల రాజన్న, నాయకులు, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళిక పై గ్రామసభలు

దండేపల్లి: మండలంలోని చింతపల్లి, నెల్కివెంకటాపూర్ గ్రామాల్లో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సోమవారం గ్రామసభలు నిర్వహించారు. ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీడీవో మల్లేశం, ఎంపీవో సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

దండేపల్లి: మండలంలోని పెండ్లిమడుగు గిరిజన గ్రామంలోని గిరిజనులకు యువరాజ్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్సై సాంబమూర్తి దుప్పట్లు పంపిణీ చేశారు.

సమాచారం

'కంటి వెలుగు' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజయ్య

మంచిర్యాలటౌన్: స్థానిక మున్సిపాలిటీలోని 36వార్డుల్లో ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య అన్నారు. మున్సిపల్ అత్యవసర సమావేశంను సోమవారం మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ ఎన్. బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని 36వార్డుల్లో మూడు నుంచి ఐదు రోజుల పాటు కంటి వెలుగు క్యాంపులు ఏర్పాటు చేస్తారని, ఈ క్యాంపుల సమయంలో ఆయా వార్డుల్లోని ప్రజలందరికీ కంటి పరీక్షలు జరిగేలా వార్డు కౌన్సిలర్లు చూడాలన్నారు. వార్డులో ఏర్పాటు చేసే క్యాంపుల్లో తగినటువంటి మౌలిక వసతులను ఏర్పాటు చేయడంతో పాటు, పరీక్షల కోసం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వారి కంటి పరీక్షలు సజావుగా సాగేలా సహకరించాలని సూచించారు.

నేడు 'కంటి వెలుగు'పై సమావేశం

కాసిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.ఏ.అలీం తెలిపారు. సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

13న టోర్నమెంట్

భీమిని: మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్‌కు ఆసక్తి కలిగిన క్రీడాకారులు హాజరై తమ పేర్లను 11వ తేదీలోపు నమోదు చేసుకోవాలని ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఎలాంటి ఎంట్రీ ఫీజ్ లేకుండా ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 98881 99090నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మహాసభలు జయప్రదం చేయండి

దండేపల్లి: రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో ఈ నెల 13,14తేదీల్లో నిర్వహించే టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఐదో మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవేణు కోరారు. ఈ సందర్భంగా ప్రచార పోస్టర్లను సోమవారం దండేపల్లిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తులసిపతి, మల్లేశం, నాయకులు చంద్రమౌళి, రవీందర్, ప్రసాద్ రావు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

పనులు ప్రారంభం

వేమనపల్లి: మండలంలోని మంగెనపల్లిలో రూ.6లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కోలి వేణుమాదవ్ సోమవారం పనులు ప్రారంభించారు. అనంతరం కేతన్‌పల్లి గ్రామానికి చెందిన సిపెల్లి శంకర్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7331119940
చెన్నూర్ : క్రిష్ణ - 8309865990
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899